# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  15-04-2025                    సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ కు రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు ఆమోదం తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను వచ్చే నెల 2వ తేదీన ప్రారంభించనున్నారు.
- మత్స్యకార భరోసా కింద లబ్ధిదారులకు ఈ నెల 26వ తేదీన 20 వేల రూపాయలు అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- పదహారవ ఆర్థిక సంఘం రేపు విజయవాడకు రానుంది.
- విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందేలా 200 పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.

========================

రాష్ట్ర మంత్రివర్గం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు అమరావతిలో సమావేశమైంది. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ కు ఈ కేబినెట్ సమావేశంలో మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 617 కోట్ల రూపాయలతో అసెంబ్లీ, 786 కోట్ల రూపాయలతో హైకోర్టు భవన నిర్మాణాలకు సైతం ఈ సమావేశంలో ఆమోదం లభించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. విశాఖపట్టణంలోని ఐటీ హిల్ -3 పైన టీసీఎస్ సంస్థకు 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకి 3.5 ఎకరాలు కేటాయిస్తూ.. కేబినెట్ నిర్ణయం తీసుకుంది. బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణాలపై ఒడిశా పవర్ కన్సార్టియమ్‌కు కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 2వ తేదీన అమరావతిలో పర్యటించనున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలిపారు. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధానమంత్రి రాష్ట్రానికి రానున్నారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇన్ ఛార్జ్ మంత్రుల పర్యటనల్లో ఎన్డీయే కూటమి నాయకుల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని, పీఎం సూర్యఘర్ పథకాన్ని మరింత వేగవంతంగా అమలు చేయాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

========================

మత్స్యకార భరోసా కింద లబ్ధిదారులకు ఈ నెల 26వ తేదీన 20 వేల రూపాయలు అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ రోజు అమరావతిలోని మంత్రివర్గ నిర్ణయాలను ఆయన పాత్రికేయులకు వివరిస్తూ... రాష్ట్రంలో టీసీఎస్ విస్తరణకు విశాఖలో భూమి కేటాయించామని, భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు సైతం నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గుంటూరులో ఈఎస్ఐ ఆసుపత్రికి ఉచితంగా భూమి ఇవ్వనున్నామని, గ్రేహౌండ్స్ విభాగానికి కొత్తవలసలో భూమి కేటాయిస్తామని మంత్రి తెలియజేశారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు వివరిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

========================

విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందేలా 200 పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నివేదిక, సుప్రీం కోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుని, జాతీయ ఎస్సీ కమిషన్ సూచనల మేరకు ఎస్సీ ఉప మర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ కు రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. ఆ వివరాలకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాత్రికేయులకు వివరిస్తూ... ఎస్సీ ఉపకులాల ఏకీకృత, సమానమైన పురోగతి కోసం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ వర్గీకరణ ప్రకారం 59 ఉపకులాలను 3 గ్రూపులుగా విభజించనున్నామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

========================

పదహారవ ఆర్థిక సంఘం ఎన్.టి.ఆర్ జిల్లాలో పర్యటించనుంది. విజయవాడ భవానిపురంలోని హరిత బెరం పార్క్ నందు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ఆర్థిక సంఘం పాల్గొనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

========================

రాష్ట్రంలో కొత్తగా 2 వేల 260 స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తం పోస్టులలో 1,136 ఎస్జీటీ, 1,124 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆటిజం సహా మానసిక వైకల్యం కలిగిన వారికి విద్యను బోధించేలా ఈ ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయనున్నామని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది.

========================

అమరావతిలో మరోదశ భూసమీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలోని అనంతవరంలో గ్రావెల్ క్వారీలను మంత్రి నారాయణ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... అమరావతిలో 5 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారని.. దానికోసం భూమి అవసరం అవుతుందన్నారు. అయితే భూసేకరణ ద్వారా భూములు తీసుకుంటే కేవలం రిజిస్ట్రేషన్ ధరలో రెండున్నర రెట్లు మాత్రమే ఎక్కువ వస్తుందని... అలా కాకుండా భూసమీకరణ ద్వారా తీసుకుంటే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులు కూడా భూ సమీకరణ వైపే మొగ్గు చూపుతున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. రాజదాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే 42 వేల 360 కోట్ల రూపాయల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని మంత్రి నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

========================

న్యాయ స్థానాలలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించడంతో పాటూ వివాదాలను తొలి దశలోనే పరిష్కరించడానికి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పార్వతీపురం మన్యం 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి మే 10వ తేదీన మొదటి జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా కోర్ట్ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు పెండింగ్ లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చునని సూచించారు.

========================

ఈశాన్య మధ్యప్రదేశ్ నుండి దక్షిణ ఒడిశా తీరం వరకు ఉన్న విస్తరించి ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం ఈరోజు దక్షిణ మధ్యప్రదేశ్ మధ్య భాగం నుండి ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా మీదుగా పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ గంగా తీరం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే 3 రోజులకు వాతావరణ సూచనలను వాతావరణ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

========================
========================